## క్లుప్తంగా

### ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో శనివారం రాత్రి రెండు ట్రాక్టర్‌లకు చెందిన బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. బాధితులు అప్పిసి మహేశ్, రావుల శ్రీనివాస్ తమ ట్రాక్టర్లను తమ వ్యవసాయ బావుల వద్ద ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్లి ట్రాక్టర్‌లను స్టాట్ చేయడానికి ప్రయత్నించగా స్టాట్ కాకపోవడంతో బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పొలాలు దున్నే సమయంలో ట్రాక్టర్ బ్యాటరీలు అపహరణకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### వాహనాల వేగానికి కళ్లెం వేయండి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాల వేగానికి అంతు లేకుండా పోతోంది. ఫలితంగా ఉదయం, సాయంత్రం విద్యార్థులు రోడ్డు దాటాలంటేనే జంకుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పరిసర ప్రాంతాల్లో సంచరించే కోతులు సైతం రోడ్డు దాటుతూ మృత్యువాత పడుతున్నాయి. విద్యార్థులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదాల బారిన పడతారోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### ముగిసిన మహా పాదయాత్ర



యాత్రలో పాల్గొన్న స్వాములు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం గ్రామానికి చెందిన పలువురు అయ్యప్ప మాల ధారులు చేపట్టిన మహా పాదయాత్ర ఆదివారంతో ముగిసింది. కరీంనగర్‌కు చెందిన శ్రీఅఖిల అయ్యప్ప పాదయాత్ర ట్రస్ట్ వ్యవస్థాపకుడు, గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో అక్టోబర్ 14న చేపట్టిన ఈ పాదయాత్రలో దాచారం గ్రామానికి చెందిన బొల్లం శ్రీధర్, గాజ రాజు, మధు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు. 48రోజులలో 1,345 కిలోమీటర్ల పాదయాత్ర చేసి స్వామిని దర్శించుకున్నట్లు వారు తెలిపారు.

### గురుకులాలపై బీఆర్ఎస్ కుట్ర



మాట్లాడుతున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గురుకులాలపై బీఆర్ఎస్ పార్టీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా గురుకులాల సెక్రెటరీగా విధులు నిర్వహించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ విద్యార్థులతో రాజకీయం చేయడం తగదని మండిపడ్డారు. గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, కలుషిత ఆహారంతో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హయాంలో అనేక అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. తన వర్గీయులకు గురుకులాల్లో టెండర్‌లు ఇప్పించుకున్నారని, ఆయన ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాలను పక్కకు పెట్టి, విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేద్దామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అత్తు ఇమామ్, యాదగిరి, అంజన్న, బుచ్చి రెడ్డి, గోపీకృష్ణ, ముద్దంలక్ష్మి, షాబుద్దీన్, వనజ, కవిత, గయాజొద్దీన్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

### అన్న ప్రసాద వితరణ



అన్నదానంలో పాల్గొన్న సేవా సమితి సభ్యులు

హుస్నాబాద్: అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సేవా సమితి నిర్వాహకులు మాట్లాడారు. ప్రతి అమవాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రుణమాఫీ విడుదల

సిద్దిపేటకమాన్: రైతులకు నాలుగో విడత రుణమాఫీ గైడ్‌లైన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్ల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు ఆదివారం తెలిపారు. రూ.2లక్షల పైగా రుణాలు ఉన్న 9,063 మంది రైతులకు దాదాపు రూ.95 కోట్లు జమైనట్లు ఆయన తెలిపారు.

# ‘విత్తనోత్పత్తి’కే ఆసక్తి

హుస్నాబాద్ మెట్ట నేలల్లో రైతులు విత్తనోత్పత్తి పంటలను సాగు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సీజన్‌కు ముందే విత్తన కంపెనీ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దిగుబడులపై నమ్మకం కల్పించటం, పంట దినుసులను కొనుగోలు చేయడానికి అంగీకారం తెలుపటంతో రైతులు ముందుకు వస్తున్నారు.

- మొక్కజొన్న, వరి వైపు రైతుల చూపు
- డివిజన్‌లో వేయి ఎకరాల్లో సాగు
- అధిక దిగుబడులు, గిట్టుబాటు ధరలు
- సాగులో విత్తన కంపెనీల సలహాలు



హుస్నాబాద్ మండలంలో సాగుచేసిన మొక్కజొన్న పంట

హుస్నాబాద్‌రూరల్: అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో దాదాపుగా 750ఎకరాల్లో మొక్కజొన్న, 300ఎకరాల వరకు వరి పంటను రైతులు సాగు చేస్తున్నట్లు ఆయా కంపెనీల ఆర్గనైజర్లు తెలిపారు. హుస్నాబాద్ ఎర్ర నేలలు విత్తనోత్పత్తికి అనువుగా ఉండటం వల్లే ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతోందని చెప్తున్నారు.

**అధిక దిగుబడులు**

హైబ్రిడ్ రకానికి చెందిన విత్తనాలను సాగు చేయడం వల్ల రైతులు ఆశించిన దిగుబడులు పొందుతున్నారు. పంటల సాగు సమయంలో చీడపీడలు, రసాయ ఎరువుల వాడకం లాంటి అంశాల గురించి కంపెనీల ఆర్గనైజర్లు క్షేత్ర స్థాయిలో రైతులకు వివరిస్తున్నారు. అవసరమైన ఎరువులు, పురుగుల మందులను కూడా వారే అందజేస్తున్నారు.

**ఆశించిన ఫలితం**

సలహాలు, సూచనలు పాటించటంతో రైతుల కష్టానికి ఆశించిన ఫలితం దక్కుతోంది. మొక్కజొన్న డబుల్ క్రాస్ విత్తన రకాన్ని(బెడ్డు తోసే) క్వింటాలుకు రూ.2వేల నుంచి రూ.3వేలు వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తారు. దీంతో రైతులకు మక్కలను పట్టే అవసరం ఉండదు. చేలలో సేకరించిన మొక్కజొన్న కంకులను నేరుగా తీసుకువెళ్లటం వల్ల రైతులకు పంటల వద్ద కాపలా ఉండే అవసరం లేదు. వరి ఆడ, మగ విత్తన రకం క్వింటాలుకు రూ.13వేల నుంచి రూ.15వేల వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తారు. సాధారణ విత్తన రకం ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.200లు అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తారు. వరి ధాన్యంలో కూడా రైతులు తాలు తీయడం లాంటి పనులు ఉండవు, హమాలీ చార్జీలు కూడా కంపెనీలే భరించటంతో రైతులు ఎక్కువగా విత్తనోత్పత్తి పంటలను సాగు చేస్తున్నారు.

**మాట ఒప్పందంతోనే సాగు**

రైతులకు కంపెనీలు ఎలాంటి అగ్రిమెంట్లు చేసుకోవు, విత్తనోత్పత్తికి అనువైన నేలలను గుర్తించి నమ్మకం ఉన్న రైతులను చేరదీసి విత్తనం సరఫరా చేస్తారు. ఎకరాకు రూ.60వేల నుంచి రూ.80వేల వరకు రైతులకు చెల్లిస్తామని హామీ ఇచ్చి పంటలను సాగు చేయిస్తారు. 30యేళ్ల నుంచి మెట్ట ప్రాంతం రైతులు విత్తనోత్పత్తి పంటలను సాగు చేయడానికి మొగ్గు చూపిస్తున్నారు. రైతుల కష్టానికి తగిన ఫలితం రావడంతో హైబ్రిడ్ రకం పంటలను సాగు చేస్తున్నారు.

### రెండు ఎకరాల సీడు మక్క పెట్టిన



నాకు ఉన్న రెండు ఎకరాల్లో సీడు మక్క పెట్టిన. ఏ ఖర్చు ఉండదు. చేను మీద పొట్టుతీయగానే కంపెనీ వాళ్ల వచ్చి బెండుతోని తీసుకపోతరు. క్వింటాలుకు రూ.2వేలు ధర ఇస్తారు. మాకు పంట సాగుచేసే సమయంలో కూడా కంపెనీ సార్లు వచ్చి తెగుళ్లు, రసాయన ఎరువులు వేయడం గురించి చెప్తుతారు. మంచి దిగుబడులు రావడంతో హైబ్రిడ్ రకం పంటలను సాగు చేస్తున్నాం. మా దగ్గర దినుసు తీసుకొని డబ్బులు ఎగవేసిన ఘటనలు ఎప్పుడూ జరగలేదు.

– మల్లేశం, రైతు, చౌటపల్లి

### రైతులకు లాభాలు వచ్చే పంటలే వేస్తారు



హుస్నాబాద్ నేలలు విత్తనోత్పత్తికి అనువుగా ఉండటంతో విత్తన కంపెనీలు రైతులను చేరదీసి విత్తనం సరఫరా చేసి పంటలు సాగు చేయిస్తున్నాయి. రైతులకు లాభాలు వచ్చే పంటలను సాగు చేస్తారు తప్ప మనం వేయమన్న పంటలు రైతులు వేయరు. విత్తన కంపెనీలు వచ్చిన మాటకు కట్టుబడి రైతులకు డబ్బులు చెల్లించడంతో రైతులు వాళ్ల ఇచ్చే పంటలను సాగుచేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఫౌండేషన్ సీడు సరఫరా చేసేది. ఇప్పుడు రావడం లేదు, మినీ విత్తన కిట్స్ కూడా వస్తే రైతులకు ఇచ్చి సాగు చేయించేది.

– రమేశ్, ఏడీఏ, హుస్నాబాద్

## డంపింగ్ యార్డు కాదు.. వాగు!



రాముని‌పట్ల వద్ద వాగులో వేసిన చెత్తాచెదారం



చిన్నకోడూరు(సిద్దిపేట): తడి,పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అది అమలు కావడంలేదు. మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపు యార్డుకు తరలించకుండా పారిశుద్ధ్య కార్మికులు వాగులో వేస్తున్నారు. ఆ చెత్తకు నిప్పుపెట్టి కాలుస్తున్నారు. కొన్ని నెలలుగా అలా డంపు చేయడంతో వాగు డంపింగ్ యార్డుగా దర్శనమిస్తోంది.

## ఏమి చేశారని విజయోత్సవాలు

**మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం**

సిద్దిపేటజోన్: ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందని విజయోత్సవాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, సీనియర్ నాయకులు గుండు భూపేశ్ ఆదివారం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ప్రజా పాలన అని చెప్పి దగా పాలన చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా విజయోత్సవ వేడుకల పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు సుందర్, మోహిజ్, సాయి ఈశ్వర్ గౌడ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్, మైనార్టీ నాయకులు హైమద్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటజోన్: మాట్లాడుతున్న సాయిరాం

**హామీల అమలులో విఫలం**

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. చిన్నకోడూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పాపయ్య, శ్రీనివాస్, ఉమేశ్ చంద్ర, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి పాల్గొన్నరు.

## మేధస్సును పెంచేందుకే ‘వ్యాసరచన’



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

కోహెడరూరల్(హుస్నాబాద్)/దుబ్బాక/తొగుట (దుబ్బాక): విద్యార్థుల మేధస్సును పెంచేందుకు వ్యాసరచన పోటీలు ఎంతో తోడ్పతాయని హెచ్‌ఎం నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని రాంచంద్రపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా ఆదివారం ‘పునరుత్పాదక శక్తి –వనరులు’ అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎండీ షాదుల్లా ప్రథమ బహుమతి, శ్రీనిత ద్వితీయ బహుమతి, అక్షయ్ తృతీయ బహుమతి పొందారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి మరిన్ని పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, చంద్రశేఖర్, లింగారెడ్డి, గణేశ్, స్వాతి తదితరులు ఉన్నారు. అదేవిధంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 9, 10వ తరగతికి చెందిన 30మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈఓ ప్రభుదాసుతో పాటు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో అక్షయ్‌కుమార్, అశ్విత, నీక్షిత మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వారికి మండల విద్యాధికారి వడ్ల కొండ నర్సయ్య బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రవికిరణ్, విజయభాస్కర్, వేంకటేశ్, సుధాకర్, ఆంజనేయులు, సత్యనారాయణ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీ నివారణపై అవగాహన ర్యాలీ





ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: హెచ్‌ఐవీ నివారణపై గజ్వేల్‌లో ఐఎంఏ, ఎన్ఎంఏ, స్నేహ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగమున్నయ్య, కార్యదర్శి డాక్టర్ చంద్రారెడ్డి, కోశాధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరేశ్‌బాబు మాట్లాడుతూ ఎయిడ్స్ సోకినట్లు అనుమానం ఉన్నట్లయితే సమీపంలోని ఏఆర్టీ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు మందులతో సాధారణ జీవితం గడపవచ్చని, వ్యాధిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ, గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వైద్యులు, లయన్స్ క్లబ్ స్నేహ సభ్యులు పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని రిమ్మనగూడలో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి గజ్వేల్ పోలీసులు దాడిచేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారినుంచి రూ.28,700; 5సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

### ముగిసిన కార్తీక దీపోత్సవం



దీపాలు వదులుతున్న మహిళలు

చేర్యాల(సిద్దిపేట): నెల రోజుల నుంచి ఘనంగా కొనసాగుతున్న కార్తీక మాస దీపోత్సవం ఆదివారంతో ముగిసినట్లు స్థానిక శ్రీవేణు గోపాల స్వామి ఆలయ అర్చకుడు రాజు స్వామి తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశామని చెప్పారు. ఆదివారం అధిక సంఖ్యలో మహిళలు నీటిలో దీపాలను వదిలారు.



సమ్మేళనంలో పాల్గొన్న 1994-95 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 1994–95, 2008–09 బ్యాచ్‌లకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభుదాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### నిబంధనలు గాలికి



దుబ్బాకటౌన్: పెట్రోల్ బంకుల్లో యాజమాన్యాలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సదుపాయాలు అటకెక్కుతున్నాయి. బంకుల్లో వినియోగదారులకు అవసరమైన మరుగుదొడ్లు, మూత్రశాలలతో పాటు ఫ్రీ ఎయిర్ సౌకర్యాన్ని విస్మరిస్తున్నారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలోగల ఓ పెట్రోల్ బంకులో ఉచితంగా గాలి సదుపాయం కల్పించకపోవడంతో నిత్యం మూతబడి దర్శనమిస్తోంది.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

**ఎంఈఓ రంగనాయక్**

అక్కన్నపేట(హుస్నాబాద్): క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎంఈఓ గుగులోతు రంగనాయక్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో ఆదివారం సన్నాహక క్రీడాపోటీలు నిర్వహించారు. అందులో భాగంగా నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అంతక్కపేట, అక్కన్నపేట పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీల్లో క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతిభను కనబరించిన క్రీడాకారుల జట్టుకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శైలజ, కేజీబీవీ ప్రత్యేకాధికారి సరిత, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట నర్సయ్య, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కిష్టయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

**నీలం మధు ముదిరాజ్**

సిద్దిపేటరూరల్/చేర్యాల(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): మలిదశ తెలంగాణ ఉద్యమంలో పోలీస్ కిష్టయ్య పోరాటం స్ఫూర్తి దాయకమని పలువురు నేతలు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం క్రిష్టయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణరావుపేట మండలంలోని జక్కాపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత నీలం మధు ముదిరాజ్ క్రిష్టయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజేవీర్, శ్రీనివాస్, అశోక్, బాలయ్య పాల్గొన్నారు. చేర్యాలలో ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి యాట యాదగిరి, నాయకులు రవి, నాగయ్య, భిక్షపతి, మల్లేశం యాట భిక్షపతి, రవి, వెంకటేశం, స్వామి, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం పాలమాకులలో కనకరాజు, మల్లేశం, రాజు, చంద్రయ్య, సంపత్, సాయిలు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరులో జంగిటి శ్రీనివాస్, నాయకులు పాపయ్య, వెంకటేశం, శ్రీనివాస్, నారాయణ, సుధాకర్, శేఖర్, నాగరాజు, యాదగిరి పాల్గొన్నారు. బెజ్జంకిలో మొండయ్య, తిరుపతి, సంతోష్, కనుకయ్య, రాజయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. మద్దూరులో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు బోయిని శ్రీనివాస్, మనోహర్, పరమేశ్వర్, నరసింహులు, నరహరి, బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: నివాళులర్పిస్తున్న నీలం మధు

**విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ**

గజ్వేల్: పోలీస్ కిష్టయ్య విగ్రహ ఏర్పాటుకు గజ్వేల్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా అయ్యప్ప పడిపూజ**



ములుగు(గజ్వేల్): ములుగులో దాస చంద్రశేఖర్ 18వ మాలాధారణ సందర్భంగా అయప్ప మహా పడి పూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, గురుస్వాములు మురళీధర్‌శర్మ, బలవంతరెడ్డి, నర్సయ్య, అయ్యప్ప మాల ధారులు పాల్గొన్నారు.

◆ **ముగ్గురిపై కేసు నమోదు**

అక్కన్నపేట(హుస్నాబాద్): సాగుకు సిద్ధం చేసిన పొలాన్ని ఓ గేదె ధ్వంసం చేసిందన్న ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదైంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం మసిరెడ్డితండాకు చెందిన కల్యాణ్‌కు చెందిన పొలాన్ని అదే తండాకు చెందిన మాలోతు రంగనాయక్ చెందిన బర్రె ఆదివారం ధ్వంసం చేసింది. దీంతో కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగనాయక్ అతని భార్య, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **నేడు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్**

గజ్వేల్‌రూరల్: తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు వంటేరు సత్యనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ టెస్టులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను మండల స్థాయిలో జరిగే టెస్ట్‌కు ఎంపిక చేస్తారని చెప్పారు.

◆ **తీర్పు ప్రకారమే నియామకాలు చేపట్టాలి**



బెజ్జంకి(సిద్దిపేట): సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్(ఎంఈఎఫ్)రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చేబర్తి యాదగిరి సీఎంను కోరారు. బెజ్జంకిలో ఆదివారం నిర్వహించిన ఎంఈఎఫ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సంతోష్, లక్ష్మణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **1974 గ్రాడ్యుయేట్ల సమ్మేళనం**

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1974లో డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు అమ్మన చంద్రారెడ్డి, చొప్పదండి హరిశ్చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1974లో డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

◆ **నూతన కార్యవర్గం ఎంపిక**

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. నూతన అధ్యక్షుడుగా మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ప్రతాప్ రెడ్డి, కోశాధికారిగా బాల్ రెడ్డిని ఎంపిక చేశారు. డైరెక్టర్లుగా తిరుపతిరెడ్డి, కనకారెడ్డి, రాజిరెడ్డి, సంతోష్, దేశమంతరెడ్డి, నర్సింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా సంజీవరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంరెడ్డిని నియమించారు.

◆ **పుట్ల ఏసుకు సన్మానం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ పుట్ల ఏసును ఆదివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ఏసు పాల్గొన్నారు. ఆయనను రాష్ట్ర అధికార ప్రతినిధి దాస అంజయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, బాలయ్య, చాంద్ పాషా, షాబుద్దీన్, నరేశ్ సన్మానించారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లిలో ఆదివారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పంజ స్వామి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. గ్రామంలోని 13మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. నాగులు, లక్ష్మా రెడ్డి, రమేశ్, జైపాల్ రెడ్డి, ప్రశాంత్, చంద్రం, ముత్యాలు పాల్గొన్నారు.